సాక్షి వికారాబాద్

శనివారం | 9 | సెప్టెంబర్ | 2023



టీచర్ పోస్టులు @823

నిరుద్యోగ అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. 10లో ▸



రాజ్యాధికారమే లక్ష్యం

బహుజన రాజ్యాధిరామే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కో- ఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ అన్నారు. 10లో ▸



రుచి మధురం

సీతాఫలం.. పేరు వినగానే ప్రతిఒక్కరికీ నోరూరుతుంది. సహజ సిద్ధంగా లభించే ఈ ఫలాల్లో ఎన్నో పోషకాలుంటాయి. 11లో ▸

న్యూస్‌రీల్

రేపు పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం ప్రారంభం

హాజరుకానున్న మంత్రి, ఎమ్మెల్యేలు



ముస్తాబవుతున్న ఈఈ కార్యాలయం

తాండూరు రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహంలో పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. వారం రోజుల క్రితం తాండూరు సబ్ డివిజన్‌కు పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం మంజూరైన విషయం తెలిసిందే. అధికారులు అతిథి గృహాన్ని ఎంపిక చేసి సామగ్రిని సమకూర్చారు. ఆదివారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హాజరు కానున్నారని అధికారులు తెలిపారు.

లక్కీ డ్రాలో వెంకటమ్మకు ద్వితీయ బహుమతి

రూ. 25వేల విలువ చేసే చెక్కు అందజేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



సజ్జనార్ చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న వెంకటమ్మ దంపతులు

కొడంగల్ రూరల్: రాఖీ పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన మహిళల కోసం లక్కీ డ్రా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.. ఆ రోజు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన వారు టికెట్ వెనుక భాగంలో వారి ఫోన్ నంబర్ రాసి బస్టాండులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేశారు. నగరంలోని ఎంజీబీఎస్‌లో శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సమక్షంలో ఆర్టీసీ అధికారులు లక్కీ డ్రా తీశారు. కొడంగల్ మండలం పర్సాపూర్‌కు చెందిన వెంకటమ్మకు ద్వితీయ బహుమతి లభించింది. వెంకటమ్మ, వెంకటయ్య దంపతులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా రూ. 25వేల నగదు బహుమతిని చెక్కు రూపంలో అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ.. రాఖీ పండుగ రోజు పర్సాపూర్ నుంచి కోస్గి పట్టణానికి ఆర్టీసీ బస్సులో ప్రయాణించినట్లు తెలిపారు. కోస్గి బస్టాండులోని బాక్స్‌లో తమ టికెట్‌ను వేశామని తెలిపారు. లక్కీ డ్రాలో ద్వితీయ బహుమతి రావడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

ఓటు వజ్రాయుధం

ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్



మాట్లాడుతున్న నారాయణ అమిత్

అనంతగిరి: ఓటు వజ్రాయుధంతో సమానమని సహాయ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో స్లీప్ యాక్టివిటీ కోఆర్డినేటర్ కోటాజీ, ఇంటర్మీడియెట్ విద్య జిల్లాఅధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాళ్లు మల్లయ్య, సురేశ్వరస్వామి పాల్గొన్నారు.

సయోధ్య కుదిరేనా..?



మంత్రితో అంటీముట్టనట్లుగా జిల్లా ఎమ్మెల్యేలు

- 'పట్నం' అనుచర వర్గం తలోదారి
- ఎటూ తేల్చుకోలేక అయోమయం
- మంత్రి మొదటి పర్యటనకూ హాజరుకాని శాసనసభ్యులు
- బయట శుభాకాంక్షలు.. లోపల దూరంగానే..
- మనోహర్‌రెడ్డి నివాసంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే భేటీ

వికారాబాద్: మంత్రి మహేందర్‌రెడ్డికి జిల్లాలోని ఎమ్మెల్యేలకు మధ్య సయోధ్య కుదిరేనా అనే అంశం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మూడేళ్ల క్రితం రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ వీడి అధికార పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో ప్రారంభమైన గ్రూపు రాజకీయాలు తాండూరు నుంచి జిల్లా మొత్తం వ్యాపించాయి. అధికార బీఆర్‌ఎస్‌లో పట్నం వర్సెస్ ఎమ్మెల్యేలు అంటూ జిల్లా మొత్తం రెండు వర్గాలుగా చీలిపోయి అధిష్టానానికి తలనొప్పులు తెచ్చిపెట్టింది. కొడంగల్ ఎమ్మెల్యే మినహా జిల్లాలోని శాసనసభ్యులందరూ ఒక్కటై తనను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారని గ్రహించిన పట్నం జిల్లాలో రెబల్ స్టార్ అవతారమెత్తారు. పట్నం మహేందర్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలను తన అనుచరులుగా మార్చుకుని అధికార పార్టీ పెద్దలతో పాటు జిల్లా ఎమ్మెల్యేలకు కొరకరాని కొయ్యగా మారిన విషయం తెలిసిందే. చివరికి పార్టీని సైతం వీడతారనే ప్రచారం ఊపందుకున్న నేపథ్యంలో ఊహాగానాలకు తెరదించుతూ మంత్రి పదవి చేపట్టి మరోసారి జిల్లా రాజకీయాలను షేక్ చేస్తూ అందరికి ఊహించని షాకిచ్చారు. అయితే ఇప్పటి వరకు పైపైకి అందరు కలసిపోయాం అంటూ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపినప్పటికీ వారి మధ్య ఇంకా సఖ్యత కుదర లేదనే చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. అదే ఆయన మొదటి అధికారిక పర్యటన. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాకపోవడం.. వారిలో సఖ్యతపై అనుమానాలకు తావిస్తోంది.

పట్నం వర్గం తలోదారి

మంత్రి పదవి చేపట్టే వరకు ఆయనతో ఉంటూ వచ్చిన అనుచరగనం పదవి చేపట్టాక చెట్టుకొకరు పుట్టకొకరు అన్న చందంగా తయారయ్యాయి. పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఉన్న నాయకులందరు పట్నం మహేందర్‌రెడ్డితో జతకట్టిన విషయం తెలిసిందే.. మహేందర్‌రెడ్డితో పాటు జతకట్టిన నేతలందరికీ ఎవరి అవసరాలు, ఎవరి డిమాండ్లు, ఎవరి ఆశలు, ఎవరి అలకలు వారికి ఉన్నాయి. అయితే అధిష్టానం తాండూరు బీఆర్‌ఎస్ టికెట్ రోహిత్‌రెడ్డి ఇవ్వడం, పట్నం అలక బూనకుండా మంత్రి పదవితో పట్టాభిషేకం చేసింది. అధిష్టాన నిర్ణయంతో రెబల్ వర్గంలో పట్నం ఒక్కడికి మినహా ఆయన వర్గంలోని వారందరికీ నిరాశే ఎదురైంది. ఇక ఏం చేయాలో పాలుపోని అసమ్మతి నేతలు ధిక్కార స్వరం వినిపిస్తూ తలోదారి చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు ఇతర పార్టీల వైపు చూస్తుండగా, మరి కొందరు నామినేటెడ్ పదవులు ఇప్పించాలని మంత్రి మహేందర్‌రెడ్డి చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం.

మనోహర్‌రెడ్డి నివాసంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే భేటీ

వికారాబాద్ నుంచి పలువురు నేతలు ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డారు. పరిగి నుంచి డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. అధికార పార్టీ మొదటి జాబితాలో జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికి టికెట్లు దక్కాయి. అయితే తనకే టికెట్ ఖాయమంటూ ప్రచారం చేసుకున్న మనోహర్‌రెడ్డి బీఆర్‌ఎస్ జాబితాలో పేరు లేకపోవడంతో కార్యకర్తలు, నియోజకవర్గానికిదూరంగా ఉంటున్నారు. అయితే రెండు రోజుల క్రితం మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో కలసి నగరంలోని మనోహర్‌రెడ్డి నివాసంలో భేటీ అయినట్లు తెలుస్తోంది. వీరి భేటీతో విడిపోయిన పరిగి నేతలు, కార్యకర్తలు కలుస్తారా? మనస్ఫూర్తిగా మహేశ్‌రెడ్డికి సపోర్టు చేస్తారా? లేక పక్కదారులు వెతుక్కుంటారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



ముహూర్తం ఖరారు

- జేపీఎస్‌లు ఇక ప్రభుత్వ ఉద్యోగులు
- నేడు మంత్రి పట్నం చేతులమీదుగా నియామక పత్రాలు
- నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారికే అవకాశం
- 309 మందికి లబ్ధి

వికారాబాద్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులకు నియామక పత్రాలు అందించేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. గత జూలైలో వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పట్లో జేపీఎస్‌లతో పాటు వీఆర్‌ఏలకు నియామక పత్రాలు అందజేసేందుకు సర్కారు సన్నాహాలు చేయగా కొంతమంది వీఆర్‌ఏలు కోర్టు గడప తొక్కడంతో ప్రక్రియ వాయిదా పడింది. వీఆర్‌ఏల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున వారిని పక్కన పెట్టి జేపీఎస్‌లను మాత్రమే రెగ్యులరైజ్ చేసి నియామక పత్రాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కలెక్టర్ పర్యవేక్షణలో ఇందుకు సంబంధించిన కసరత్తును పూర్తి చేశారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు నియామక పత్రాల అందజేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ వారి పనిని పూర్తి చేసి మార్కులు కేటాయించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం హాల్‌లో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఉదయం 9:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారికే..

నాలుగేళ్లు పూర్తి చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో 70 మార్కులు సాధించిన జేపీఎస్‌లను మాత్రమే రెగ్యులరైజ్ చేస్తామనే ప్రభుత్వం షరతు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా త్రిసభ్య కమిటీని వేసింది. ఎనిమిది పారామీటర్స్ ఆధారంగా వారి పనిని అంచనా చేశారు. వంద మార్కులకు గాను కనీసం 70 మార్కులు సాధించాలనే నిబంధన విధించారు. అయితే ఈ కసరత్తును పూర్తి చేసిన త్రిసభ్య కమిటీ అర్హుల జాబితాను సిద్ధం చేసింది. జిల్లాలో మొత్తం 566 జీపీలు ఉండగా.. 420 మంది జేపీఎస్‌లు పని చేస్తున్నారు. వీరిలో 309 మంది ప్రస్తుత ఆగస్టు నాటికి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. వీరిని మాత్రమే రెగ్యులరైజ్ చేయనున్నారు. అయితే ప్రభుత్వ షరతుల కారణంగా 111మంది జేపీఎస్‌లు ఆందోళనకు గురవుతున్నారు. ఇతర శాఖల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే సమయంలో పని అంచనా విధానం అమలు చేయని ప్రభుత్వం ఒక్క మా విషయంలోనే ఎందుకిలా వివక్ష చూపుతుందో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే త్రిసభ్య కమిటీలో పని విధానంపై అవగాహన లేని పోలీసు అధికారి, ఫారెస్టు అధికారులను నియమించడాన్ని కూడా వారు తప్పు పడుతున్నారు. తాము చేసే పని విధానం తెలియని అధికారులు పనికి మార్కులు వేయడం ద్వారా తమకు అన్యాయం జరుగుతోందని వారు వాపోతున్నారు. ఎలాంటి షరతులు లేకుండా అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

'పాలమూరు' కాల్వలపై అధ్యయనం



పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఈ ధర్మానాయక్

- క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన ఇరిగేషన్ శాఖ సీఈ ధర్మానాయక్
- గట్టెపల్లి చెక్‌డ్యాం సందర్శన

ధారూరు: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డిజైన్‌లో రూపొందించిన కాలువలు, చెక్ డ్యాంలను ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మానాయక్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. శుక్రవారం తాండూరు ఈఈ సుందర్, డీఈలు భాస్కర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, కిష్టయ్యతో కలిసి మండలంలోని గట్టెపల్లి చెక్‌డ్యాంను పరిశీలించారు. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ముందుగా డిజైన్ చేసిన ప్రకారం కాలువలు నిర్మించాలా లేదా ఏదైనా మార్పులు చేయడం వల్ల సాగు విస్తీర్ణం పెరుగుతుందా అనే విషయాలపై అధికారులు అధ్యయనం చేశారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి చెరువును రిజర్వాయర్‌గా చేయడానికి గల అవకాశాలను ఈఈ సుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కాలువ వికారాబాద్ నుంచి ధారూరు, కోట్‌పల్లి ప్రాజెక్టు, పెద్దేముల్ మండలంలో ఏఏ ప్రాంతాల మీదుగా వెళుతుంది అనే విషయాలను మ్యాప్‌లో పరిశీలించారు. ఈ పథకం కింద నిర్మించే కాలువలు జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులను నింపేలా డిజైన్ చేసినట్లు ఆయన వివరించారు. ధారూరు మండలంలో కాలువల ద్వారా పంటలకు ఏ మేరకు నీరందుతుంది అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ గట్టెపల్లి సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంలో వేసవిలో కూడా నీరు ఉంటుందని, దీంతో భూగర్భ జలాలు పెరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు నవీన్‌కుమార్, సాయిబన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త అవసరం

- అన్ని వార్డుల్లో ఫీవర్ సర్వే చేపట్టాలి
- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్

తాండూరు టౌన్: సీజనల్ వ్యాధులపై మున్సిపల్, వైద్య సిబ్బంది దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ, గ్రామీణ మున్సిపల్, వైద్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులు మారుతున్నందున ప్రజలు మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడు వాపు, వైరల్ ఫీవర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు.ఏఎన్‌ఎం,ఆశ వర్కర్లు విధిగా ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా, మెడికల్ ఆఫీసర్ గిరిధర్ రావు, మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, మెడికల్ సబ్ యూనిట్ ఇంచార్జి మల్లేశం, ఏఎన్‌ఎంలు, ఆశలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్

ఆర్థిక పురోగతి సాధించాలి



అనంతగిరి: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

- వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

మర్పల్లి: ముస్లిం మైనార్టీలు ఆర్థిక పురోగతి సాధించాలని, ఇందుకోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో 65 మంది ముస్లిం మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదుగుదల సాధించాలని సూచించారు. అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సోయేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలోనూ సమన్యాయం

అనంతగిరి: సంక్షేమ పథకాల అమలులోనూ ప్రభుత్వం సమన్యాయం పాటిస్తోందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో 65 మంది ముస్లిం మైనార్టీలకు మంజూరైన మైనార్టీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా సమర్థవంతమైన ప్రజా పరిపాలన కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాలకు న్యాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సిద్దలూరు ఎంపీటీసీ సభ్యుడు గౌస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మైనార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో మనమే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి
- కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామంలో సర్పంచ్ అంజప్ప ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, రూ.13లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. రూ.60లక్షల నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనతోనే గ్రామాలు, తండాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.20లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులను కేటాయిస్తూ పనులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

50వేల మెజారిటీ ఇవ్వాలి

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 50వేల మెజారిటీ అందించాలని కోరారు. తొమ్మిదేళ్లుగా నియోజకవర్గానికి దూరంగా ఉన్న రేవంత్‌రెడ్డి గ్రామాల్లో పర్యటించి గెలిపించాలని కోరుతాడని.. ప్రజలు ఆయనకు తగిన బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సయ్యద్ అంజాద్, గుండప్ప, శంకర్‌నాయక్, గోవిందు, నాయకులు కాశప్ప, సిద్దిలింగప్ప, కాశప్ప, మధుసూదన్‌యాదవ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతరకు ముస్తాబైన ఆలయం

నేటి నుంచి పాంబండ చిన్న జాతర

శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు చిన్న జాతర నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 9నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ సుధాకర్ తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. 11వ తేదీ శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. – కుల్కచర్ల



రామలింగేశ్వర స్వామి

క్లుప్తంగా

రేపు జాతీయ లోక్ అదాలత్

అనంతగిరి: జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం

ఇద్దరిపై కేసు

ధారూరు: విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు పనుల్లో ఆటంకం కలిగించిన ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం రాత్రి కుక్కింద క్రాస్‌రోడ్డులో ఏఎస్‌ఐ సంగమేశ్, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్‌గౌడ్, కానిస్టేబుళ్లు శంకర్, వినోద్ కుమార్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు కుక్కింద గ్రామం వద్ద ఆటో ఆపి డ్రైవర్‌ను పరీక్షిస్తున్నారు. ఇందుకు ఆయన నిరాకరించాడు. పక్కనే ఉన్న ఆటో డ్రైవర్ మిత్రుడు కానిస్టేబుల్ వినోద్‌కుమార్‌ను కిందకు తోసేసి వీరు పారిపోయారు. వీరిని ధర్మాపూర్ గ్రామానికి చెందిన సమ్మని కిష్టయ్య, బోయిని లింగంగా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కేబుల్ వైర్లు దొంగిలిస్తున్న వ్యక్తిపై..


నిందితుడు జంగయ్య

దోమ: కేబుల్ వైర్లు దొంగతనానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో గాన్గ నర్సింహులు అనే మోటార్ మెకానిక్ దుకాణంలో గ్రామానికి చెందిన దక్కలి జంగయ్య అనే వ్యక్తి కేబుల్ వైర్లు దొంగిలించాడు. గమనించిన గ్రామస్తులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని విచారించగా గతంలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బోరు మోటార్ల కేబుల్స్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని మహిళ మృతి



అనంతగిరి: గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి మృతి చెందినట్లు వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. గొల్లగూడ–శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య కి.మీ 130/9–8 యూపీ లైన్ ట్రాక్ వద్ద గురువారం రాత్రి 10గంటల సమయంలో బీదర్–మచిలీపట్నం వెళ్తున్న రైలు కింద పడి మృతిచెందింది. మృతురాలి వయసు 25–30 ఉంటుందన్నారు. ఒంటిపై పసుపు రంగు చుడీదార్, గులాబీ ప్యాంట్, నలుపు రంగు స్వెటర్ ధరించి ఉందన్నారు. వికారాబాద్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీకి తరలించామన్నారు.

అంగన్‌వాడీల సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ప్రకటించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 60 సంవత్సరాలకు నిర్ణయించాలని సూచించారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రకటించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, ఎంజే ప్రకాశ్ షకారత్, ఎన్.యాదగిరి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులు @823

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 465 పోస్టులు
- హైదరాబాద్ జిల్లాలో 358
- తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు
- 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, రంగారెడ్డి జిల్లా: నిరుద్యోగ అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) నోటిఫికేషన్ విడుదలైంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 823 పోస్టులను భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, పీఈటీ, భాషా పండితుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 358 పోస్టులు, మేడ్చల్ జిల్లా పరిధిలో 78, రంగారెడ్డి జిల్లా పరిధిలో 196, వికారాబాద్ జిల్లా పరిధిలో 191 పోస్టుల భర్తీకి నవంబర్ 20 నుంచి 30వ తేదీల మధ్య తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు (కంప్యూటర్ ఆధారిత) నిర్వహించనున్నట్లు పేర్కొంది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితి 44 ఏళ్లుగా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఇచ్చింది. దివ్యాంగులకు అదనంగా మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చింది. దరఖాస్తు ఫీజు రూ.1000గా నిర్ణయించింది.

మొదలైన బదిలీల ప్రక్రియ

రంగారెడ్డి జిల్లాలో 6,919 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో కొంత మంది ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగుతున్నారు. ఇలాంటి వారందరికీ స్థానచలనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు 4,722 దరఖాస్తులు అందాయి. గతంలో 4,194 మంది దరఖాస్తు చేసుకోగా, తాజాగా మరో 528 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 212 మంది ఎలాంటి ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల పేర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో డిస్‌ప్లే చేశారు. 10, 11వ తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబర్ 3లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

జిల్లాల వారిగా ఖాళీలు..

జిల్లాపేరు	స్కూల్ అసిస్టెంట్	భాషా పండిట్	పీఈటీలు	ఎస్‌జీటీలు	మొత్తం
హైదరాబాద్	116	57	22	163	358
రంగారెడ్డి	48	25	06	117	196
మేడ్చల్	25	07	01	45	78
వికారాబాద్	102	12	-	77	191

పారదర్శకంగా నిర్వహిస్తాం..



ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియతో పాటు కొత్తగా చేపట్టనున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్టును అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తాం. ఎలాంటి అవినీతి, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వం. అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ మొదలు.. పరీక్షలు, పేపర్ వాల్యూయేషన్ ఇలా ప్రతీది ఆన్‌లైన్ వేదికగా నిర్వహిస్తాం. మానవ తప్పిదాలకు ఆస్కారం లేదు. ఫేక్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసిన అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. బదిలీలు, ఖాళీల భర్తీ విషయంలో మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు. పైరవీలకు ఎంత మాత్రం ఆస్కారం లేదు.

– సుశీందర్‌రావు, డీఈఓ

‘దళిత బంధు’ పార్టీ నాయకులకా..?

- అనర్హులను ఎంపిక చేశారని దళిత సంఘాల నాయకుల ఆగ్రహం
- సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పరిగి: దళిత బంధు పథకాన్ని అర్హులకు కాకుండా పార్టీ నాయకులనే ఎంపిక చేస్తున్నారని మండల పరిధిలోని రాపోల్ గ్రామ దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు పరిగి–షాద్‌నగర్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మను దహనం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం తీసుకువచ్చిన పథకంలో రాజకీయ నాయకుల జోక్యం తగదన్నారు. గ్రామానికి 12 యూనిట్లు కేటాయిస్తే సర్పంచ్ కేవలం పార్టీనాయకులను, అనర్హులను ఎంపికచేశారని ఆరోపించారు. అధికారులు అర్హులైన వారిని ఎంపిక చేసి వారికే అందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చొరవ తీసుకుని అర్హులను ఎంపిక చేసి పార్టీలకతీతంగా అర్హులైన వారికి దళిత బంధు పథకాన్ని అందించేలా చూడాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు నాగవర్ధన్, రవికుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ‘న్యాక్–బి’


సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్)–బి గ్రేడ్ గుర్తింపు లభించింది. ఆగస్టు 22, 23 తేదీల్లో న్యాక్ ద పీర్ బృంద సభ్యులు ప్రొఫెసర్ సంజీవ్ మిట్టల్, ఎంవీఎన్ ప్రసాద్, అలోక్ కుమార్ చతుర్వేది బృందం కళాశాలను సందర్శించింది. 2017 నుంచి 2022 వరకు కళాశాల పనితీరు, ఫలితాలను, కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాలలు, బొటానికల్ గార్డెన్, క్రీడా ప్రాంగణం తదితర మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులు, పేరెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. బృంద సభ్యులు అందించిన నివేదికతో బెంగళూర్‌లోని న్యాక్ కళాశాలకు బి గ్రేడ్ గుర్తింపును అందజేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. కళాశాలకు న్యాక్ బిగ్రేడ్ గుర్తింపు రావడం గర్వనీయమన్నారు. ఈ గ్రేడ్‌తో కళాశాలకు ప్రత్యేక నిధులు మంజూరవుతాయని, ఇట్టి నిధులతో కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. బి గ్రేడ్ కేటాయించడం పట్ల కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ అష్రాఫుల్ హక్, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎరువుల స్టాక్ రిజిస్టర్ తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న గోపాల్

పరిగి: రైతులకు అడిగిన వెంటనే ఎరువులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ ఎరువుల దుకాణ యజమానులకు సూచించారు. శుక్రవారం ఆయన పట్టణ కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎరువులు అమ్మిన వెంటనే వివరాలను ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు దుకాణాదారులు యూరియా కొనుగోలుకు వస్తే వేరు ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నారని తమ దృష్టికి వచ్చిందని వారి వివరాలు సేకరించి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వర్షాలకు పంటలకు తెగుళ్లు సోకుతున్నాయన్నారు. ఎక్కువగా పత్తి పంటలకు పారావిల్ట్ సోకుతుందని తెగుళ్ల నివారణకు రైతులు అధికారుల సలహాసూచనలు పాటించాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి రైతులకు సలహాలు సూచనలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఓ డీఎస్ లక్ష్మీకుమారి, ఏఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్


గోరేపల్లిలో పర్యటిస్తున్న బీఎస్పీ నాయకులు

యాలాల: బహుజన రాజ్యాధిరామే బీఎస్పీ లక్ష్యమని పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన ‘గడపగడపకు ఏనుగు’ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గోరేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పాలకులు బహుజనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆరోపించారు. ఏనుగు గుర్తుకు ఓటేసి బహుజన రాజ్యాధికార సాధనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దొరశెట్టి సత్యమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌రాజ్, నాయకులు గోపాల్, సాయికృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదింట పథకాల వెలుగులు

- పరిగి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి
- పథకాలను అవినీతిమయం చేయొద్దు
- మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కుల్కచర్ల: ప్రభుత్వ పథకాలతో పేదింట వెలుగులు నిండుతున్నాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో పేదల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. రైతుబంధు, రైతు బీమా, గొర్రెల పంపిణీ, బీసీ బంధు, దళిత బంధు, మైనార్టీ బంధు లాంటి అత్యుత్తమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అన్నారు.

కమీషన్లు తిరిగి ఇచ్చేయండి

దళితబంధు పథకంలో కొందరు కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అలా ఎవరైనా చేస్తే దరఖాస్తుదారులకు తిరిగి ఇచ్చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ అన్నారు. ఎవరైనా కమిషన్లు ఇచ్చినట్లు గుర్తిస్తే వారికి పథకాన్ని ఆపి చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు, మధ్యవర్తులు పథకాలను అవినీతిమయం చేయవద్దని సూచించారు. కాగా సమావేశంలోనే కమీషన్ల విషయం ప్రస్తావిస్తున్నారంటే అధిష్టానానికి విషయం తెలిసి స్థానిక నేతలతో చెప్పిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కాగా ఏళ్ల నుంచి పార్టీలో పనిచేస్తుంటే తమను కాదని కొత్తగా చేరిన వారికి దళితబంధు ఎలా ఇస్తారంటూ పలువురు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు.

మరోసారి కాంగ్రెస్‌దే విజయం


నూతన అధ్యక్షులతో రమేశ్ మహరాజ్

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్

తాండూరు: తాండూరులో నియోజకవర్గంలో మరోసారి కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నియోజవకర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులను ఎన్నుకున్నారు. తాండూరు పట్టణ అధ్యక్షుడుగా హబీబ్‌లాల, మండల అధ్యక్షుడిగా జెన్నె నాగప్ప, బషీరాబాద్ మండల అధ్యక్షుడిగా కలాల్ నర్సింహులుగౌడ్, యాలాల అధ్యక్షుడిగా ఎం.నర్సిరెడ్డి, పెద్దేముల్ అధ్యక్షుడిగా కొండాపూర్ గోపాల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. తాండూరు ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. పార్టీ టికెట్ తనకే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్ మహరాజ్, మాజీ కౌన్సిలర్ పి.బస్వరాజ్, నాయకులు ఉత్తమ్‌చంద్, జనార్ధన్‌రెడ్డి, కోర్వార్ నగేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ నుంచి గులాబీ గూటికి చేరిన నాయకులు

మహేశ్వరం: నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కల్వకోల్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సర్పంచ్ గాదె థామస్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా మహేశ్వరంపై ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా, డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మూడోసారి గెలిపిస్తాయన్నారు. కల్వకోల్–అమీర్‌పేట్ వయా పెండ్యాల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.8 కోట్ల నిధులు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు లక్ష్మణ్, బావయ్య, చంద్రశేఖర్,కష్ణ, నాగరాజు, బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు శేఖర్, లక్ష్మణ్, బి.రాజు శేఖర్, సత్యనారాయణ తదితరులున్నారు. వీరికి మంత్రి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

దోమ: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులతో పాటు ఇంటి యాజమానిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన ప్రకారం.. శుక్రవారం మండల పరిధిలోని కొండాయపల్లిలో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు తమ సిబ్బందితో కలిసి గ్రామంలోని రాంచంద్రయ్య ఇంటిపై దాడి చేసి పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుంచి నగదు, పేకాట ముక్కలను సా. దీనం చేసుకున్నామని చెప్పారు. ఇంటి యజమాని సమాచారం ఇవ్వకపోవడంతో రాంచంద్రయ్యను అదుపులోకి తీసుకున్నామన్నారు.

బీజేపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేయడానికి కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన అమడపురం నర్సింహగౌడ్ శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాను మహబూబ్‌నగర్ పార్లమెంట్ కోకన్వీనర్‌గా బాధ్యతలు చేపడుతున్నట్లు చెప్పారు. షాద్‌నగర్‌లో బీసీల ప్రాబల్యం అధికంగా ఉందని ఈ మేరకు తనకు అవకాశం కల్పించాలని అధిష్టానానికి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, రమేష్, రణధీర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, జగన్‌గౌడ్, శ్రీశైలం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

షాద్‌నగర్ ఏసీపీ సీఎన్ రంగస్వామి


ఆమనగల్లు: జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో రాజీపడే కేసులలో ఇరువర్గాలు చర్చించుకుని రాజీపడాలని షాద్‌నగర్ ఏసీపీ సీఎన్ రంగస్వామి కోరారు. ఈనెల 9న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన టౌన్ పీఎస్‌ను సందర్శించి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బలరాంలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రాజీ పడే కేసులకు సంబంధించి ఇరువర్గాలకు ఏసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు.

లారీ బోల్తా.. కారు ధ్వంసం


జేసీబీ సాయంతో ఇనుప రాడ్ల తొలగింపు

అనంతగిరి: ఇనుప రాడ్లలోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటన వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి నందిఘాట్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి తాండూరుకు ఇనుప రాడ్ల లారీ వెళ్తుంది. ఈ క్రమంలో నందిఘాట్ రోడ్డుకు రాగానే ఒకవైపు పర్యాటకుల కారు నిలిపి ఉంచారు. మరో వైపు నుంచి బైక్ రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో లారీ బోల్తాపడింది. ఇనుప రాడ్లు రోడ్డుపై, పక్కనే ఉన్న కారుపై పడ్డాయి. ఈ ఘటనలో కారు ధ్వంసమవ్వగా లారీ డ్రైవర్, ఆయనతో ఉన్న మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రోడ్డుపై పడిన ఇనుప రాడ్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

చిలుకూరు బాలాజీ సన్నిధిలో కృష్ణాష్టమి


కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారి ఊరేగింపు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి మరుసటి రోజు ఇక్కడ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే శుక్రవారం స్వామివారిని ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం ముందు ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి, ఉట్లుకొట్టే కార్యక్రమం విశిష్టతను ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమీషనర్ గోపాలకృష్ణస్వామి, చిలుకూరు సర్పంచ్ గునుగుర్తి స్వరూప, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ జీఎస్ రాజు, పోలీస్ పటేల్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరుకు ‘లా’ కళాశాల మంజూరు

కందుకూరు: బీసీ గురుకుల లా కళాశాలను ప్రభుత్వం కందుకూరుకు మంజూరు చేసింది. మహాత్మా గాంధీ బీసీ డిగ్రీ గురుకులాల్లో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు బదులు ఈ ఏడాది నుంచే బీఏ–ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ లా కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జీఓ జారీ చేసింది. ఈ ఏడాది నుంచే లా తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కందుకూరుకు లా కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటయ్యాయన్నారు. కందుకూరుకు మెడికల్ కళాశాల సైతం మంజూరైందన్నారు. త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బడుగులకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.